పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యం

డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

చిక్కడపల్లి, ఆగస్టు31 : ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదల, క్రమశిక్షణతో కృషిచేస్తే విజయం సాధించడం సులభతరం అవుతుందని చిక్కడపల్లి సీఐ సీతయ్య అన్నారు. చిక్కడపల్లిలోని న్యూ ఎరా జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీని శనివారం బాగ్‌లింగంపల్లి వీఎస్టీ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిక్కడపల్లి సీఐ సీతయ్య, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ జితేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆట్టుకున్నాయి.

ఉన్నత విద్యతోనే సమాజంలో మార్పు

ఉన్నతమైన విద్యతోనే వ్యవస్థలో మార్పు వస్తుందని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు అన్నారు. విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు శనివారం కామారెడ్డిలో మెరిట్ అవార్డ్సును అందజేశారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ వెంకట్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉన్నతమైన విద్య కోసం మున్నూరుకాపు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. ట్రస్టీ పిల్లి శ్రీనివాస్‌రావు, మామిండ్ల అంజయ్య, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

– కాచిగూడ, ఆగస్టు 31

జాబ్ మేళాకు స్పందన

జాబ్ మేళాలో పాల్గొన్న వారికి నియామక పత్రాలు అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ స్వామియాదవ్

కార్వాన్, ఆగస్టు31 : కార్వాన్ నియోజకవర్గం అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. కార్వాన్ మొఘల్ కా నాలా రోడ్‌లోని మహబూబ్ ప్లైడ్ ఫంక్షన్ హాల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకుగాను ఎంఐఎం పార్టీ ఏఎంపీ అనే ప్రైవేట్ సంస్థ సహకారంతో కలిసి శనివారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చింది. నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు . ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి.. వారిని ఆదుకునేందుకు తమవంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో 10వ తరగతి నుంచి పీజీ వరకు నిరుద్యోగుల అర్హతను బట్టి ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. అంతే కాకుండా నిరుద్యోగులు ఉద్యోగం పొందడం కోసం వారికిసరైన శిక్షణతో పాటు ఇంటర్వ్యూలో ఎలా నడుచుకోవాలి, ఉద్యోగం ఎలా సంపాదించాలి అనే విషయాలపై కూడా శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల్లో ఎంపికైనవారికి ఎమ్మెల్యే నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందగిరి స్వామి యాదవ్, నసీరుద్దీన్‌తో పాటు పలు సంస్థల ప్రతినిధులు, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ లక్ష్యం

సింటెక్స్ ట్యాంకును పరిశీలిస్తున్న గోషామహల్ బీఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్, ఆగస్టు 31: ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని గోషామహల్ నియోజకవర్గం ఆపార్టీ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గౌలిగూడ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంక్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం గౌలిగూడ ప్రాంతంలో సింటెక్స్ ట్యాంక్ పగిలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తాను ఆ ప్రాంతాన్ని సందర్శించి తక్షణమే నూతన ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను కోరగా.. ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. సింటెక్స్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసిన వాటర్ వర్క్స్ నాల్గవ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్, మేనేజర్ మధుసూదనాచారిలకు ప్రజల తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు వీరాచారి, అశోక్ గౌడ్, రాజు, శంకర్, జ్ఞానేశ్వర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలి

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మణిపూర్ కుకీ తెగలు

రవీంద్రభారతి, ఆగస్టు 31: మణిపూర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తే రెండు తెగలు శాంతించే అవకాశం ఉంటుందని కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ నేతలు వెల్లడించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నేతలు లెట్కోలం సుజాతక్, ఫ్రాన్సిస్ హాయోకిప్, టోంగ్‌మిన్ తాంగ్, డౌన్జెల్ గ్రేసి, కోర్గు సాయి, జైసి చాంగ్లీలు మాట్లాడారు. కుకీ, మైతి తెగలు ఆరు నెలలుగా విడిపోయి దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఘర్షణలు తొలగి శాంతియుత వాతావరణం ఏర్పడాలంటే కేంద్ర ప్రభుత్వం సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆర్మీక్యాంపులు, నిషేధిత ప్రాంతాలు ఎల్లకాలం నిలబడవని అన్నారు. ఈ రెండు తెగలను సోదరభావంతో మెలిగేలా కేంద్ర ప్రభుత్వం చూడాలన్నారు. భౌగోళికంగా , సాంస్కృతికంగా, భాషా పరంగా తాము ఒక్కటే అయినా.. తమ మధ్య ఏర్పడిన అంతరాలు తమను విడదీస్తున్నాయని చెప్పారు. తమ విన్నపాన్ని కేంద్ర ప్రభుత్వం అంగీకరించి కేంత్ర పాలిత ప్రాంతంగా ప్రకటించి.. సామరస్య వాతావరణానికి సహకరించాలని వారు కోరారు.

రాంసింగ్‌పురా రోడ్డు సమస్య పరిష్కరించాలి

మొఘల్ కా నాలా వైపు వెళ్లే రోడ్డు దుస్థితి గురించి అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ స్వామియాదవ్

కార్వాన్, ఆగస్టు 31 : రహదారి గుంతలుగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని కార్వాన్ డివిజన్ కార్పొరేటర్ మందగిరి స్వామి యాదవ్ అన్నారు. కార్వాన్, రాంసింగ్‌పురాలోని రాధాకృష్ణ ఆలయం నుంచి గణేశ్ ఘాట్ వరకు రోడ్డును నిర్మించకుండా వదిలేయడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో స్పందించిన కార్పొరేటర్.. అధికారులతో కలిసి శనివారం ఆ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పురానాపూల్, కార్వాన్ నుంచి లంగర్‌హౌస్‌కు వెళ్లాలంటే రాంసింగ్‌పురా, గణేశ్ ఘాట్ రోడ్డు మీదుగా ఒక్కటే ప్రధాన రహదారి అని.. అయితే గతంలో ఈ ప్రాంతం నుంచి పురానాపూల్ వరకు 100 ఫీట్ల రోడ్డును నిర్మించి.. రాంసింగ్‌పురా రాధాకృష్ణ ఆలయం నుంచి గణేశ్ ఘాట్ వరకు దాదాపు 200 మీటర్ల రోడ్డును నిర్మించకుండా అసంపూర్తిగా వదిలేశారు. ఈ వర్షాలకు మట్టిరోడ్డు గుంతలు పడడంతో వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొందని అన్నారు. ఈ రోడ్డును పూర్తి చేయాలని కోరుతూ ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, జలమండలి జీఎం, సుబ్రమణ్యం, ప్రాజెక్టు మేనేజర్ కుమార్, సీఆర్ఎంపీ రవి కిరణ్, జీహెచ్ ఎంసీ ఈఈ వెంకట శేషయ్యలను కలిసి సమస్యను వివరించిపట్లు తెలిపారు. త్వరలో రోడ్డును నిర్మించి సమస్యలు తీర్చాలని అధికారులను వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్యం

రవీంద్రభారతి, ఆగస్టు 31: భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, శంకరానంద కళాక్షేత్రం, తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తామ్ర పాత్రలైవ్ అన్నమయ్య కవితా సౌందర్యంపై ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన శనివారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఐదుగురు ప్రముఖ నృత్యగురువులు ఆనంద శంకర్ జయంత్, అనుపమకైలాస్, దీపికారెడ్డి, గోపికా వర్మ, వియాభా అరేకర్ ప్రదర్శన ఆకట్టుకున్నది. ముఖ్య అతిథిగా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి అన్నమయ్య కవితా సౌందర్యంపై ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. ప్రముఖ భరత నాట్యకారిణి ఆనంద శంకర్ జయంత్ ఆలవేలుమంగ, వెంకటేశ్వరుల సమాగమాన్ని వర్ణించే సంకీర్తన ద్వారా ప్రేక్షకులను మైమరిపించారు. శ్రీవెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ ప్రముఖ కూచిపూడి నాట్యగురువు దీపికారెడ్డి అన్నమయ్య కీర్తనలను ఆవిష్కరించారు. అనుపమ కైలాస్ ఆలవేలుమంగా పాత్రను ధరించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

టీజీవో మెడికల్ అండ్ హెల్త్ ఫోరం నూతన అడహక్ కమిటీ నియామకం

సుల్తాన్‌బజార్,ఆగస్టు 31 : తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు నూతన అడహక్ కమిటీ నియామకమయ్యింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కలీమోద్దీన్ అహ్మద్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఆయన స్థానంలో అధ్యక్షుడిగా, నూతన కార్యవర్గం ఏర్పాటయ్యే వరకు అడహక్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వివరాలను వెల్లడించారు. కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసులు, కో కన్వీనర్‌లుగా రామాంజనేయులు గౌడ్, సునిల్‌రాజ్, నామాల శ్రీనివాస్, చంద్ర ప్రకాశ్, సభ్యులుగా సకలా రెడ్డి, విజయ నిర్మల, శ్రీనివాసులును నియమిస్తూ ఆదేశాలను జారీ చేశారు. నెల రోజుల్లో అన్ని జిల్లాల్లో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని అడహక్ కమిటీ నూతన కార్యవర్గానికి ఆయన సూచించారు.

వినాయక ప్రతిమ ఆగమన్

గోషామహల్ హిందీనగర్‌లో వినాయక ప్రతిమ ఆగమన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అభిమన్యు యూత్ అసోసియేషన్ నిర్వాహకులు విశాల్, తరు, నిఖిల్‌ల ఆధ్వర్యంలో గోమాతపై ఆసీనులైన వినాయక ప్రతిమను తయారీ కేంద్రం నుంచి భారీ ఊరేగింపుగా హిందీనగర్‌లోని మండపానికి తరలించారు. ముఖ్య అతిథులుగా గొల్లకిడికి కిట్టు యాదవ్, సెట్విన్ మాజీ డైరెక్టర్ ధన్‌రాజ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సతీష్‌లు పాల్గొని పూజలు నిర్వహించారు. – అబిడ్స్, ఆగస్టు 31

మధుకుమార్ దంపతులకు సత్కారం

హైదరాబాద్ వన్ వినియోగదారుల కమిషన్ సూపరింటెండెంట్ మధుకుమార్ పదవీ విరమణ వేడుకలు శనివారం జరిగాయి. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలో పదవీ విరమణ చేస్తున్న మధుకుమార్,ఆయన సతీమణి మహబూబ్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిరలను శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. వినియోగదారుల స్టేట్ కమిషన్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ మీనా రామనాథన్, సభ్యులు ఆర్ఎస్ రాజశ్రీ, వీవీ శేషుబాబు, జిల్లా కమిషన్ అధ్యక్షుడు వక్కంటి నరసింహారావు, సీహెచ్ లలిత కుమారి, రాంగోపాల్ రెడ్డి, ఉమ, సుబ్బలక్ష్మి, సభ్యులు జవహర్ బాబు, జనార్దన్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీదేవి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, ఆగస్టు 31

కష్టపడి చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్

చిక్కడపల్లి, ఆగస్టు 31: విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి పట్టుదలతో కృషి చేస్తే తప్పకుండా విజయం సాధిస్తారని మహాత్మ గాంధీ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి అన్నారు. అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గ్రాడ్యుయేషన్ సెరమని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్ రెడ్డి.. విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కృష్ణం రాజు, ప్రముఖ పర్యావరణవేత్త ఠాకూర్ రేష్మా సింగ్, అవంతి విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.ప్రియాంక,అధ్యక్షుడు ఎం.జ్ఞానేశ్వరి, శ్రవణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎం.వి.ఎస్.ఎస్.నందీష్, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై.జయప్రద, డాక్టర్ వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ పి.వీరసామయ్య పాల్గొన్నారు.

కులగణనపై ప్రధానిపై ఒత్తిడి తేవాలి

కాచిగూడ,ఆగస్టు 31: కులగణనపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి లక్షలాదిమందితో ప్రత్యేక స్థాయిలో త్వరలో ఉద్యమం చేస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల భావితరాల కోసం మోదీ ప్రభుత్వం జనాభా గణనలో కులగణన చేపట్టి, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులగణన చేయడానికి ప్రతిపక్ష, అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. బీజేపీలో సీనియర్ బీసీ నాయకులందరు కులగణన చేసేందుకు ప్రధానిపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీదళ్ నాయకులు పాల్గొన్నారు.

బహుభాషా పండితుడు నారాయణ దాసు..

ముషీరాబాద్, ఆగస్టు 31: హరికథ తెలుగు భాషకు మాత్రమే సొంతమైన ప్రాచిన కళా సంపద అని మాజీ ప్రభుత్వ సలహారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో తెలంగాణ హరికథా కళాకారుల ఆధ్వర్యంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు 160 జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి ఆదిభట్ల నారాయణ దాసు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నారాయణ దాసు ఆరంభించిన హరికథా మహాగాన యజ్ఞం శాతాబ్దిపైగా కొనసాగి ఈ నాటికి ఎందరికో ఆ కళ ఉపాధి ఇస్తుందని తెలిపారు. నారాయణ బహుభాషా పండితుడని, సంగీతసాహిత్యాల్లో అపార జ్ఞాన నిధి అని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మద్దాళి రఘురాం, బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్, చిరంజీవాచార్యులు, తారక్, శశిభూషణ్ రావు, జాల్దా విశ్వనాథ జయరాములు పాల్గొన్నారు

చెట్ల కొమ్మల తొలగింపు

అంబర్‌పేట, ఆగస్టు 31: వచ్చే వినాయకచవితిని దృష్టిలో పెట్టుకొని బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో రోడ్ల వెంట అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను స్థానిక కార్పొరేటర్ బి.పద్మవెంకట్‌రెడ్డి శనివారం తొలగింపజేశారు. డివిజన్‌లోని రెడ్‌బిల్డింగ్, సోమసుందర్ నగర్, సీఈ కాలనీ, డీడీ కాలనీ, అయ్యప్పటెంపుల్ రోడ్డు, ఎస్బీఐ కాలనీ, శారదానగర్, తదితర ప్రాంతాల్లో మెయిన్‌రోడ్లపై అడ్డుగా ఉన్న కొమ్మలను హార్టికల్చర్ సిబ్బందిచే కొట్టించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ సూపర్‌వైజర్ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, మహేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాచిగూడ, ఆగస్టు 31: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమ రమేశ్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. డ్రైడే–డ్రైడే కార్యక్రమంలో భాగంగా శనివారం చెప్పల్‌బజార్, ఇందిరానగర్ బస్తీల్లో ఆమె పర్యటించి దోమలు వ్యాపించకుండా ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారి చేయించారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

కార్పొరేటర్ అమృత

అంబర్‌పేట, ఆగస్టు 31: హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత సూచించారు. శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా అతిభారీ వర్షాలు పడుతున్నాయని, వాతావరణశాఖ రెడ్ అలెర్ట్‌ను జారీ చేసిందని తెలిపారు. ప్రజలు ప్రధానంగా నల్లకుంట డివిజన్‌లోని హుస్సేన్ సాగర్ వరదనీటి కాలువ పరిసరాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మ్యాన్ హోల్ మూతలు తెరువవద్దని, కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని కార్పొరేటర్ సూచించారు సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

మెడికల్ విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ, ఆగస్టు 31: మనస్తాపంతో మెడికల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ వీఎన్ ఆర్ కాంప్లెక్స్‌కు చెందిన శ్రీరాములు కుమారుడు కోట బాలాజీ(21)హిమాయత్‌నగర్‌లో డీఎంఎల్‌టీ మెడికల్ కోర్సు చేస్తూ, కాచిగూడలోని త్రివేణి లాడ్జిలో పనిచేస్తున్నాడు. కొన్నేళ్లుగా బాలాజీకి మానసిక పరిస్థితి భాగలేదు. దీంతో శనివారం ఉదయం బాలాజీ జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో త్రివేణి లాడ్జిలో ఫ్యాన్‌కు బెడ్‌షిట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, ఆగస్టు 31: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానాయక్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55) శనివారం బుద్వేల్–ఉందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అత ను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాకి రంగు ప్యాంట్, సిమెంట్ రంగు టీషర్ట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నాడని, వివరాలకు ఫోన్: 8712568495లో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ ..

కాచిగూడ,ఆగస్టు 31: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మక్సూద్ తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(40) శుక్రవారం ఉప్పుగూడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం–2లో పట్టాలు దాటుతుండగా ఎంఎంటీ ఎస్ రైలు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రైల్వే పోలీసులు అతడిని ఉస్మానియా దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెబ్రోను చర్చి వద్ద ఉద్రిక్తత

చిక్కడపల్లి,ఆగస్టు31 : గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని హెబ్రోను చర్చి నిర్వహణ కోసం సొసైటీకి ట్రస్ట్ సభ్యుల మధ్య కొద్ది కాలంగా గొడవ జరుగుతుంది. ఈ అంశంపై న్యాయస్థానంలో కేసు కొనసాగుతుంది. ప్రస్తుతం సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో చర్చి నిర్వహణ కొనసాగుతుంది. కోర్టులో స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ శనివారం సాయంత్రం ట్రస్ట్ సభ్యులు చర్చిలోకి వెళ్లే ప్రయత్నం చేశారు. గేటు వద్ద సొసైటీ సభ్యులు అడ్డుకున్నారు. ట్రస్ట్ సభ్యులు అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు ట్రస్ట్‌సభ్యులను అదుపులోకి తీసుకున్నారు.

శాంతిసామరస్యాలతో జీవనం సాగించాలి

పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీ విద్యాశంకర భారతీ స్వామి అనుగ్రహభాషణ కార్యక్రమంలో పాల్గొన్న రమణాచారి

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 31 : శ్రీ పుష్పగిరి మహా ప్రస్థానం ఆధ్వర్యంలో నగరంలోని భావన ఎన్‌క్లేవ్ గణేశ దేవాలయంలో పవిత్ర శ్రావణ మాస త్రయోదశిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీ విద్యాశంకర భారతీ స్వామి ఆశీఃఅనుగ్రహభాషణ ప్రసంగం చేశారు. సమాజహితం కోసం తన ప్రసంగాలు కొనసాగుతున్నాయని.. ప్రజలు శాంతి సామరస్యాలతో జీవనం సాగించాలని భారతీ స్వామి ఉద్బోధించారు. గురువులను గౌరవించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి పాల్గొని ఉన్నతమైన జీవన విలువల గురించి వివరించారు. లోక కల్యాణం కోసం భారతీస్వామి చేస్తున్న ఉన్నతమైన ప్రసంగాలతో అనేకులు ఎంతో స్ఫూర్తిని పొంది ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు.

విద్యార్థులకు నైపుణ్య భావాలు పెంపొందించాలి

ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే

సుల్తాన్‌బజార్,ఆగస్టు 31: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నైపుణ్య భావాలు పెంపొందించడం ప్రధానమని, విద్యతో పాటు అన్ని కళల్లో ప్రావీణ్యం పొందాలన్నదే ఆయిస్టర్ సంస్థ ఆధ్వర్యంలో వీకెండ్ విస్డమ్, విజ్ఞాన్ 2కే24 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ డీఈవో సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులుకు స్కిల్ సెట్స్, లైఫ్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, తదితర అంశాల తరగతులతోపాటు క్విజ్ స్పెల్ బీ, వ్యాసరచన, చిత్రకళ, కెరీర్ గైడెన్స్ తదితర పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని అన్నా రు. ఈ వీకెండ్ విస్డమ్ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌లుగా భువ న, హర్షిణి, ఆకాష్, ఐశ్వర్య, రిషిఖ, అనన్య, శ్రావణి, అక్షిత, గోపిలు వ్యవహరిస్తున్నట్లు ఆయన వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పరంజ్యోతి, ఆయిస్టర్ రాష్ట్ర కార్యదర్శి షేక్ సొహైల్, ఆయిస్టర్ మంత్రిత్వశాఖల సభ్యులు అరవింద్, శ్రావణి, కిరణ్, నిజాం కళాశాల యూ నిట్ సభ్యులు, మహిళా విశ్వవిద్యాల యం యూనిట్ సభ్యులు విజయ, రా జు, తనిష్క పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన ఉద్యోగి చిరస్థాయిగా నిలిచిపోతారు